సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం ; 13 ; ఏప్రిల్ ; 2024



సోమశిలలో 8.75 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 8.75 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 670 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.73,800
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రాము)	రూ.6,592
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,790
నవర (8 గ్రాములు)	రూ.54,320



చెక్‌పోస్టులపై డేగకన్ను

ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని చెక్‌పోస్టులపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. నగదు, మద్యం అక్రమ రవాణను అడ్డుకునేందుకు పటిష్ట చర్యలు చేపట్టారు. 8లో

న్యూస్‌రీల్

పోలీస్ సిబ్బంది సంక్షేమమే లక్ష్యం



సమస్యలను ఆరాతీస్తున్న ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్

నెల్లూరు(క్రైమ్): పోలీస్ సిబ్బంది సంక్షేమమే ప్రథమ కర్తవ్యంగా భావించి పోలీస్ వెల్ఫేర్ డేను నిర్వహిస్తున్నామని ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ పేర్కొన్నారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ వెల్ఫేర్ డేను శుక్రవారం నిర్వహించారు. సస్పెన్షన్, ప్రమోషన్, బదిలీలు, డిప్యుటేషన్, భద్రత, హౌసింగ్ లోన్, సర్వీస్ సంబంధిత సమస్యలపై వినతిపత్రాలను సిబ్బంది అందజేశారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. కంప్లయింట్ సెల్ ఏఎస్సై శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తే చర్యలు

నెల్లూరు(అర్బన్): స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య పేర్కొన్నారు. లింగ నిర్ధారణకు సంబంధించిన పీసీపీఎన్డీటీ చట్టం అమలుపై జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశాన్ని సంతపేటలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల్లో 15 బృందాలతో విస్తృత తనిఖీలు చేస్తున్నామని చెప్పారు. లోపాలను గుర్తిస్తే కేసులను నమోదు చేస్తామన్నారు. అనంతరం సరోగసీ కోసం దరఖాస్తు చేసుకున్న వారి అర్జీలను పరిశీలించారు. డీఎల్ఏసీ, డీఎంబీ సభ్యులు గీతాలక్ష్మి, రామకిశోర్, కిరణ్, డెమో అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కుదిరితే ప్రలోభాలు.. కాకపోతే బెదిరింపులు

- వివాదాస్పదంగా వేమిరెడ్డి శైలి

కోవూరు: ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా టీడీపీ నేతలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి అడ్డదారులు తొక్కుతున్నారు. తాజాగా వీరి కన్ను విద్యాలయాలపై పడింది. కొందరు విద్యాసంస్థల నిర్వాహకులకు ఫోన్లు చేసి విద్యార్థులను తమ వద్దకు తీసుకొచ్చి పార్టీ కండువాలు వేయించాలని ఆదేశిస్తున్నారు. దీనికి డబ్బులను ఎరగా వేస్తున్నారు. ఎవరైనా అంగీకరించకపోతే భవిష్యత్తులో ఇబ్బంది పడాల్సి వస్తుందంటూ బెదిరింపు ధోరణిలో మాట్లాడుతున్నారని తెలిసింది. ఈ తరహాలో నియోజకవర్గ పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాలలకు గురు, శుక్రవారాల్లో నెల్లూరులోని వారి కార్యాలయం నుంచి ఫోన్లు వచ్చాయని సమాచారం.

సముద్రంలో వేటపై నిషేధం

నెల్లూరు (సెంట్రల్): జిల్లా పరిధిలోని సముద్ర జలాల్లో పడవలు, మరబోట్ల ద్వారా నిర్వహించే చేపల వేటపై 61 రోజుల నిషేధం ఈ నెల 15 నుంచి అమల్లోకి రానుందని జిల్లా మత్స్యశాఖ అధికారి నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సముద్రంలో చేపలు, రొయ్యల సంతానోత్పత్తి కాలాన్ని పురస్కరించుకొని ఈ నిషేధం అమల్లో ఉంటుందన్నారు. వేటకు వెళ్లరాదని, ఉత్తర్వులను ఉల్లంఘిస్తే సదరు మత్స్యకారులపై చర్యలు తీసుకోవడమే కాకుండా వారికి ప్రభుత్వం అందించే రాయితీలను నిలిపేయనున్నారని తెలిపారు. బోట్ల యజమానులు తమ పేర్లను మత్స్యశాఖ గ్రామ సహాయకులు, సాగరమిత్రల ద్వారా సంబంధిత గ్రామ ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు.

ఇంటర్‌లో బాలికలదే హవా



- ఫలితాల విడుదల
- ఫస్టియర్‌లో 69, సెకండియర్‌లో 81 శాతం ఉత్తీర్ణత
- రాష్ట్రంలో ఆరో స్థానంలో జిల్లా

నెల్లూరు(అర్బన్): ఎప్పుడెప్పుడా అని విద్యార్థులు ఆతృతగా ఎదురుచూస్తున్న ఇంటర్ పరీక్ష ఫలితాలను ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. ఫలితాల్లో బాలికలు ఉత్తమ ప్రతిభ చూపారు. పరీక్షలను గత నెల ఒకటి నుంచి 20 వరకు నిర్వహించారు.

ఫస్టియర్‌లో ఇలా..

ప్రథమ సంవత్సరానికి సంబంధించి 24,620 మంది పరీక్షలకు హాజరుకాగా, 17,100 మంది ఉత్తీర్ణులయ్యారు. 69 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 8వ స్థానంలో జిల్లా నిలిచింది. గతేడాదితో పోలిస్తే ఉత్తీర్ణత నాలుగు శాతం పెరిగింది.

ద్వితీయ సంవత్సర తీరిదీ..

ద్వితీయ సంవత్సర పరీక్షలకు 21,293 మంది హాజరుకాగా, 17,292 మంది ఉత్తీర్ణులయ్యారు. 81 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో ఆరో స్థానంలో జిల్లా నిలిచింది. గతేడాదితో పోలిస్తే ఉత్తీర్ణత ఎనిమిది శాతం పెరిగింది.

- వొకేషనల్ విద్యార్థులు మొదటి సంవత్సరంలో 64 శాతం, సెకండియర్‌లో 72 శాతం మేర ఉత్తీర్ణులయ్యారు.

బాలికలదే పైచేయి

- ఇంటర్ ఫలితాల్లో ఈ ఏడాదీ బాలికలే పైచేయి సాధించారు. మొదటి సంవత్సరంలో 11,790 మందికి గానూ 8,464 మంది ఉత్తీర్ణులయ్యారు.
- 12,830 మంది బాలురకు గానూ 8,636 మంది పాసయ్యారు.
- ద్వితీయ సంవత్సరంలో 10,473 మంది బాలికలకు గానూ 8,797 మంది పాసయ్యారు.
- 10,820 మంది బాలురకు గానూ 8,495 మంది ఉత్తీర్ణులయ్యారు.

సత్తా చాటిన గురుకుల విద్యార్థులు



గురుకుల పాఠశాలల ప్రిన్సిపల్స్, అధ్యాపకులకు అభినందన

నెల్లూరు (వీఆర్సీసెంటర్): అంబేడ్కర్ గురుకుల విద్యాలయ విద్యార్థులు ఇంటర్ పరీక్షల్లో సత్తా చాటి జిల్లాను వరుసగా మూడోసారి ప్రథమ స్థానంలో నిలిపారని జిల్లా సమన్వయాధికారి హేమలత పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె మాట్లాడారు. ద్వితీయ సంవత్సరంలో 469 మంది విద్యార్థులకు గానూ 442 మంది ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. జిల్లాలో ఆరింటికి గానూ మూడు కళాశాలల్లో నూరు శాతం ఉత్తీర్ణత నమోదైందని తెలిపారు. కోడూరులోని గురుకుల విద్యార్థి శరణ్యప్రియ 982 మార్కులను సాధించిందని వెల్లడించారు.

	హాజరైన వారు	ఉత్తీర్ణులైన వారు	పాస్ శాతం
ప్రథమ	24,620	17,100	69.45
ద్వితీయ	21,293	17,292	81.20

ఆరేళ్లలో ఫలితాల సరళి

ఏడాది	హాజరైంది	ఉత్తీర్ణులైన వారు	పాస్ శాతం
2017 - 18	27,802	21,393	76.94
2018 - 19	27,226	20,322	74.64
2019 - 20	కరోనా కారణంతో అందరూ పాస్		
2021 - 22	25,576	17,190	67.21
2022 - 23	22,789	17,438	76.51
2023 - 24	21,293	17,292	81.20

మే 24 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలను మే 24 నుంచి జూన్ ఒకటి వరకు నిర్వహించనున్నారని ఆర్‌ఐఓ శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫెయిలైన వారు, ఇంప్రూవ్‌మెంట్ రాయాలనుకునే విద్యార్థులు పరీక్ష ఫీజును సంబంధిత కళాశాలలో ఈ నెల 18 నుంచి 24లోపు చెల్లించాలని కోరారు. ప్రాక్టికల్స్ సప్లిమెంటరీ పరీక్షలను మే ఒకటి నుంచి నాలుగు వరకు జిల్లా కేంద్రాల్లో నిర్వహించనున్నామని వెల్లడించారు. రీకౌంటింగ్‌కు సంబంధించి పేపర్‌కు రూ.260 చొప్పున, రీ వెరిఫికేషన్‌కు పేపర్‌కు రూ.1300 చొప్పున ఫీజును ఆన్‌లైన్లో ఈ నెల 24 వరకు చెల్లించొచ్చన్నారు.

మంచి ఫలితాలు సాధించారు

గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం ఎక్కువ మంది ఉత్తీర్ణులయ్యారు. ఇది సంతోషకరం. భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాలను సాధించేందుకు కృషి చేస్తాం

– శ్రీనివాసులు, ఆర్‌ఐఓ

న్యూరాలజిస్టవుతా..



మాగుంట లేఅవుట్లోని కిశోర్స్ రత్నం జూనియర్ కళాశాలలో బైపీసీ చదువుతున్నా. ప్రథమ సంవత్సరంలో 440 మార్కులకు గానూ 436 సాధించా. ఇదే స్ఫూర్తితో మంచి మార్కులు సాధించి భవిష్యత్తులో న్యూరాలజిస్ట్‌గా వైద్యసేవలందిస్తా.

– చెంబేటి జాహ్నవి, భక్తవత్సలనగర్, నెల్లూరు

ఐఐటీ చదువుతా..



ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో 470కు గానూ 463 మార్కులు సాధించడం ఆనందంగా ఉంది. భవిష్యత్తులో ఐఐటీ చదవాలన్నదే నా ఆశయం. నూతన ఆవిష్కరణలు చేసి సమాజానికి ఉపయోగపడతా.

– మునిసాయి రేవంత్

ఆర్యవైశ్యుల అభ్యున్నతే లక్ష్యం



ఇంటింటి ప్రచారంలో విజయసాయిరెడ్డి, మధుసూదన్‌యాదవ్

కందుకూరు: వైఎస్సార్‌సీపీ నెల్లూరు లోక్‌సభ, కందుకూరు అభ్యర్థులు విజయసాయిరెడ్డి, బుర్రా మధుసూదన్ యాదవ్ పట్టణంలో ఎన్నికల ప్రచారాన్ని శుక్రవారం నిర్వహించారు. వాసవీనగర్ కాలనీలోని ఆర్యవైశ్యుల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేసి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడారు. ఆర్యవైశ్యుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని చెప్పారు. స్వేచ్ఛగా వ్యాపారం చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం అయ్యాకా ఇదే వాతావరణాన్ని కొనసాగిస్తామని, ఆర్యవైశ్యుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. పార్టీ పట్టణాధ్యక్షుడు రఫీ, జేసీఎస్ కన్వీనర్ ముప్పవరపు కిశోర్, గణేశం గంగిరెడ్డి, ఆర్యవైశ్య నేతలు మురారిశెట్టి శ్రీకాంత్, కందగడ్డ వెంకటేశ్వర్లు, వేములరాము, తాతా సంపత్, మురళి, అప్పల మధు, నాగసూరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

నెల్లూరు(క్రైమ్): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు నిరంతర తనిఖీలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం వరకు సంతపేటలో రూ.1.03 లక్షలు, చేజర్లలో రూ.1.7 లక్షలు, సంగంలో రూ.1.48 లక్షలు, మనుబోలులో రూ.2.1 లక్షలను ఎలాంటి పత్రాల్లేకుండా తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. చిన్నబజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 18, మర్రిపాడు పరిధిలో 22, వరికుంటపాడులో తొమ్మిది, కావలి రెండో పట్టణంలో ఏడు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 182 బాటిళ్లను ఎస్ఈబీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఎండలతో ఫైర్

- నిప్పుల కుంపటిలా జిల్లా
- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- వడగాలులతో ప్రజల బేజారు
- ఉదయం 11 గంటలకే రోడ్లు నిర్మానుష్యం

నెల్లూరు(అర్బన్): భానుడి భగభగలతో ప్రజలు ఠారెత్తిపోతున్నారు. జిల్లా నిప్పుల కుంపటిలా మారడంతో ప్రధాన కూడళ్లు ఉదయం 11 గంటలకే బోసిపోతున్నాయి. ఏప్రిల్ రెండో వారానికే ఎండలు సుర్రుమంటుంటే, మే నాటికి పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పింఛన్ల కోసం సచివాలయాల వద్దకు వచ్చి ఎండ తీవ్రతను తట్టుకోలేక వృద్ధులు మృతి చెందిన ఘటనలూ జిల్లాలో చోటుచేసుకున్నాయి.


ఏడాదిలో ఎంత మార్పో..!

గతేడాది ఏప్రిల్ ప్రారంభం నాటికి నెల్లూరు జిల్లాలో 36 డిగ్రీల ఉష్ణోగ్రతలే నమోదయ్యాయి. అయితే ప్రస్తుతం 40 డిగ్రీలకు పైగా చేరుతుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఉదయం ఏడు నుంచే సూర్య భగవానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నారు. ఉదయం తొమ్మిది తర్వాత బయటకు రావాలంటేనే జంకే పరిస్థితి నెలకొంది. ఎండలకు వడగాలులు తోడవ్వడంతో పరిస్థితి తీవ్రమైంది. ఎల్‌నినో ప్రభావం జూన్ వరకు కొనసాగనుందని, అప్పటి వరకు ఎండలను భరించాల్సిందేనని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.



ఈ నెలలో వివరాలు

తేదీ	ఉష్ణోగ్రత
1	40.0
2	39.0
3	38.4
4	39.6
5	39.5
6	40.5
7	41.0
8	38.2
9	39.6
10	36.1
11	36.6
12	37.1



కూలీలు, కార్మికుల అగచాట్లు

గ్రామీణ ప్రాంతాల్లో పనులకెళ్తున్న ఉపాధి కూలీలు, రైతులు, చిరు వ్యాపారులు, భవన నిర్మాణ కార్మికులు ఎండల తీవ్రతతో అల్లాడిపోతున్నారు. మధ్యాహ్నానికే నీరసించి సొమ్మసిల్లుతున్నారు. మరోవైపు భానుడి భగభగ రాజకీయ పార్టీల నేతలనూ ఇబ్బంది పెడుతోంది. తీవ్రతను తట్టుకోలేక తమ ప్రచారాన్ని ఉదయం, సాయంత్రాలకే పరిమితం చేశారు.

వైద్యశాఖ అప్రమత్తం

ఎండలు ఎక్కువ కావడంతో జిల్లా వైద్యశాఖ అప్రమత్తమైంది. అన్ని పీహెచ్‌సీల పరిధిలో సరిపడా సెలైన్లు, విటమిన్ ట్యాబ్లెట్లను అందుబాటులో ఉంచారు. దాదాపు ఐదు లక్షల ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను సిద్ధం చేశారు. డ్వామా ఆధ్వర్యంలో పనిచేసే ఉపాధి కూలీలకు 1.5 లక్షల ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నారు. వడదెబ్బ తగలకుండా పాటించాల్సిన జాగ్రత్తలపై కరపత్రాల ద్వారా డీఎంహెచ్‌ఓ పెంచలయ్య ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నారు.

జాగ్రత్తలతో ఆరోగ్యాన్ని కాపాడుకుందాం



తగు జాగ్రత్తలను పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. వడదెబ్బ తగిలితే అపస్మారక స్థితిలోకి వెళ్లి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. ఉదయం పది తర్వాత పనులకు వెళ్లకుండా.. సాయంత్రం తర్వాత చేసుకుంటే మంచిది. మజ్జిగ, పండ్ల రసాలతో పాటు తగినంత నీరు తాగడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

– గంగాధర్, అసోసియేట్ ప్రొఫెసర్, ఎండీ, ఫిజీషియన్, జీజీహెచ్, నెల్లూరు

18 నుంచి
నామినేషన్లు షురూ..

- ర్యాలీలకు అనుమతులు తప్పనిసరి
- ప్రచారాల్లో వ్యక్తిగత విమర్శలు చేయొద్దు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న హరినారాయణన్

నెల్లూరు (దర్గామిట్ట): నామినేషన్ల ప్రక్రియ ఈ నెల 18న ప్రారంభమై.. 25వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు పూర్తి కానుందని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. కలెక్టరేట్ ఆవరణలోని శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే అభ్యర్థులు సంబంధిత ఆర్వో కార్యాలయంలో.. లోక్‌సభకు సంబంధించిన నామినేషన్లను కలెక్టరేట్లోని ఆర్వో కార్యాలయంలో దాఖలు చేయాలని సూచించారు. నామినేషన్ల సమయంలో ఆర్వో కార్యాలయ గేట్ నుంచి 100 మీటర్ల వరకే వాహనాలకు అనుమతి ఉంటుందని.. గేటు నుంచి అభ్యర్థితో పాటు నలుగుర్ని మాత్రమే అనుమతించనున్నామని చెప్పారు. వాహనాలకు ప్రస్తుతం పొందిన అనుమతులు ఈ నెల 17 సాయంత్రంతో పూర్తికానున్నాయని, 18 నుంచి పార్టీ అభ్యర్థికి మాత్రమే ఒక వాహనానికి అనుమతి ఉంటుందని వెల్లడించారు. అన్ని రాజకీయ పార్టీలకు నామినేషన్ పత్రాలను అందజేశామని, వీటిని క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి తప్పుల్లేకుండా పూర్తి చేయాలని సూచించారు. ఫారం – ఏ, బీలో ఇంకుతో మాత్రమే సంతకం చేసి అందించాలని కోరారు. ఇంటింటి ప్రచారాలను నిర్వహించే ప్రాంతం, సమయం తదితర వివరాలపై సంబంధిత ఆర్వో కార్యాలయం, పోలీస్‌స్టేషన్లో సమాచారమివ్వాలని చెప్పారు. భారీ ర్యాలీలు, సభలు, ప్రచారాలకు సంబంధిత ఆర్వో వద్ద అనుమతులు పొందాలని కోరారు. వ్యక్తిగత విమర్శలతో పాటు కులమతాల ప్రస్తావన లేకుండా ప్రచారం చేసుకోవాలని సూచించారు. డీఆర్వో లవన్న, ఈవీఎం నోడల్ అధికారి పద్మాదేవి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి మురళీధర్‌రెడ్డి, బీజేపీ నుంచి శ్రీనివాస్, సీపీఐ నుంచి అజయ్‌కుమార్, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, కలెక్టరేట్ ఏఓ మధుసూదనశర్మ, ఎన్నికల విభాగాధికారులు అషర్, అశోక్ పాల్గొన్నారు.

ఈవీఎంల ర్యాండమైజేషన్

సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ నిర్వహించారు. కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో ప్రక్రియను జరిపారు. తొలుత నెల్లూరు లోక్‌సభ.. అనంతరం జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు బ్యాలెట్.. కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. రిజర్వ్ ఈవీఎంలను సైతం కేటాయించారు.

ఆర్‌ఎంపీల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి

కందుకూరు: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ప్రభుత్వం మరోసారి ఏర్పడిన వెంటనే ఆర్‌ఎంపీలు, పీఎంపీల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. కనిగిరి రోడ్డులోని విజయగాయత్రి కల్యాణ మండపంలో ఆర్‌ఎంపీలు, పీఎంపీలతో ఆత్మీయ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. వైద్యశాస్త్ర పితామహుడు ధన్వంతరి చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 75 వేల నుంచి 80 వేల మంది ఆర్‌ఎంపీలు పనిచేస్తున్నారని చెప్పారు. దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో వీరికి శిక్షణ ఇచ్చి గుర్తింపు సర్టిఫికెట్లను అందజేసేందుకు జీఓను సైతం జారీ చేసిన అంశాన్ని గుర్తుచేశారు. తదనంతరం ఈ అంశం నేషనల్ మెడికల్ కమిషన్‌కు వెళ్లడంతో సమస్య ఏర్పడిందని చెప్పారు. ఈ తరుణంలో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రితో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ కేంద్రాల్లో ఆర్‌ఎంపీ యూనియన్ కార్యాలయ నిర్మాణాలకు 10 సెంట్ల స్థలాన్ని కేటాయించే విషయాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని వెల్లడించారు.

పేదలకు మేలు చేసిన వ్యక్తి జగన్

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజల అభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారని పార్టీ కందుకూరు నియోజకవర్గ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్ పేర్కొన్నారు. ఆర్‌ఎంపీల్లో ఎక్కువ మంది పేదలే ఉన్నారని, వీరి సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. మోసపూరిత హామీలతో ప్రజలను నమ్మించేందుకు చంద్రబాబు యత్నిస్తున్నారని ఆరోపించారు. జరిగిన మంచిని ప్రజలకు ఆర్‌ఎంపీలు వివరించి పార్టీకి మద్దతు తెలిపేలా కృషి చేయాలని కోరారు. పార్టీ పట్టణాధ్యక్షుడు రఫీ, ఆర్‌ఎంపీ నేతలు వల్లూరి కోటేశ్వరరావు, లక్ష్మీనారాయణ, నారాయణరావు, ద్రోణాదుల సింగయ్య పాల్గొన్నారు.

అమ్మవారి కిరీట తయారీకి విరాళమిస్తా

కందుకూరు: కందుకూరు గ్రామ దేవత అంకమ్మతల్లి ఆలయాన్ని అద్భుతంగా నిర్మించారని, ఈ విషయంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి చొరవను వైఎస్సార్‌సీపీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి ప్రశంసించారు. పార్టీ కందుకూరు నియోజకవర్గ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్, ఎమ్మెల్యే మానుగుంటతో కలిసి అంకమ్మ తల్లిని శుక్రవారం ఆయన దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించిన అనంతరం విజయసాయిరెడ్డి మాట్లాడారు. అమ్మవారి కిరీట తయారీకి అవసరమైన రూ.40 లక్షలను తాను విరాళంగా అందజేస్తానని ప్రకటించారు. అనంతరం మధుసూదన్‌యాదవ్ మాట్లాడారు. ఆలయ మలిదశ నిర్మాణానికి తన వంతుగా రూ.25 లక్షలను అందించనున్నామని వెల్లడించారు. ఆలయ మొదటి దశ నిర్మాణానికి రూ.6.4 కోట్ల మేర వెచ్చించామని మహీధర్‌రెడ్డి తెలిపారు. నెల్లూరు లోక్‌సభ, కందుకూరు అభ్యర్థులుగా విజయసాయిరెడ్డి, మధుసూదన్‌యాదవ్ పోటీ చేయడం ఈ ప్రాంతానికి శుభపరిణామమని చెప్పారు. ఆలయ నిర్మాణానికి దేవదాయ శాఖ నుంచి రూ.1.18 కోట్ల మ్యాచింగ్ గ్రాంట్‌ను సీఎం విడుదల చేయించి సహకరించారని చెప్పారు. పీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ మేదరమిట్ల శంకరరెడ్డి, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు వసంతరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, కొడాలి కోటేశ్వరరావు, ఆవుల మాధవరావు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అనుక్షణం నిఘా

ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం

- రూ.11.05 కోట్ల విలువ చేసే నగదు, మద్యం సీజ్
- 25కు పైగా ఎంసీసీ ఉల్లంఘన కేసులు



వాహన తనిఖీలను పరిశీలిస్తున్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ (ఫైల్)

నెల్లూరు(క్రైమ్): సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ ఆదేశాలతో నిఘాను మరింత ముమ్మరం చేశారు. జిల్లా సరిహద్దు ప్రాంతాలతోపాటు వివిధ ప్రాంతాల్లో 18 చెక్‌పోస్టులు, 25 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసి ఎన్నికల మార్గదర్శకాలకు అనుగుణంగా నిరంతర తనిఖీలు చేపట్టారు. నగదు, మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా అక్రమంగా తరలిస్తున్న నగదును స్వాధీనం చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై 25కు పైగా కేసులు నమోదు చేసి పలు వాహనాలను సైతం సీజ్ చేశారు.

ఇప్పటి వరకు..

ఈ ఏడాది మార్చి 16వ తేదీన ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. గతేడాది డిసెంబర్‌లోనే జిల్లాలో ఎన్నికల సెల్‌ను ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా ఎలాంటి ఆధారాలు లేకుండా అక్రమంగా తరలిస్తున్న రూ.10,75,90,705 నగదును స్వాధీనం చేసుకుని ఆదాయపు పన్ను శాఖ అధికారులకు అప్పగించారు. రూ.30,03,779 విలువ చేసే 19,406 మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. 344.05 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని 28,540 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి పత్రాలు లేకుండా అక్రమంగా తరలిస్తున్న రూ.1,18,86,515 నగదును సీజ్ చేశారు. రూ.8,27,550 విలువ చేసే 5,350 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసి నిందితులపై కేసులు నమోదు చేశారు. 37.05 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని 2,450 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేశారు. తనిఖీలు కొనసాగుతున్నాయి.

పోలీస్ స్టేషన్ల సందర్శన

ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ పోలీస్ స్టేషన్లను సందర్శిస్తూ ఎన్నికల నిర్వహణపై సిబ్బంది దిశానిర్దేశం చేస్తున్నారు. మరోవైపు చెక్‌పోస్టులు, ఫ్లయింగ్‌స్క్వాడ్‌ల పనితీరును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలిస్తున్నారు. ప్రధానంగా రాజకీయ పార్టీల అధ్యక్షులు, ప్రముఖుల పర్యటనలు, బహిరంగ సభలు జరుగుతున్న క్రమంలో వీఐపీ భద్రతపై ప్రత్యేక దృష్టిసారించారు. ఎన్నికల ప్రచారాలు సజావుగా సాగేలా చర్యలు తీసుకున్నారు. అభ్యర్థుల వారీగా ప్రచార షెడ్యూల్, బందోబస్తు, నోటిఫికేషన్ అనంతరం నామినేషన్ సెంటర్లు, పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రతా ఏర్పాట్లుకు అవసరమైన అన్నీ చర్యలు తీసుకున్నారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా ఎస్పీ ఆదేశాలతో పోలీసులు ముందుకెళ్తున్నారు. రీపోలింగ్‌కు తావులేకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపడుతున్నారు. రౌడీషీటర్లు, ట్రబుల్‌మాంగర్స్, గత ఎన్నికల కేసుల్లో ఉన్న 5,882 మందిని ఇప్పటికే బైండోవర్ చేశారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆయా ప్రాంత ప్రజలతో మమేకమై ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించడంతోపాటు శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రణాళికాబద్ధంగా ముందస్తు చర్యలు చేపట్టారు. స్థానిక పోలీసు అధికారులు, కేంద్ర బలగాలతో నిత్యం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అండగా ఉంటామని భరోసా కల్పిస్తున్నారు.



నెల్లూరులో కవాతు నిర్వహిస్తున్న చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్, కేంద్ర బలగాలు

జనమంతా వైఎస్సార్‌సీపీ వైపే..



పార్టీలో చేరిన వారితో ఆదాల, వైఎస్సార్‌సీపీ నాయకులు

- రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: జనమంతా వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారని ఆ పార్టీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. టీడీపీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సమీప బంధువు, సీనియర్ నేత కలవకూరు శ్రీనివాసులురెడ్డి, ఆయన అనుచరులు భారీగా శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. నగరంలోని మినీ బైపాస్‌రోడ్డు కార్యాలయంలో ఆదాల ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అభ్యర్థి మాట్లాడుతూ పార్టీకి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఆదాలను భారీ మెజార్టీతో గెలిపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు మల్లు సుధాకర్‌రెడ్డి, కార్పొరేటర్ టి.అశోక్ కుమార్, నాయకులు పుట్ట విజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు వేలూరు శివసునీల్‌రెడ్డి, వేణుంబాకం సుధాకర్‌రెడ్డి, జార్జి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల బరితెగింపు

- వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకుడిపై దాడి

దుత్తలూరు: టీడీపీ నాయకులు కవ్వింపు చర్యలకు పాల్పడడంతోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులకు తెగబడుతున్నారు. మండలంలోని నర్రవాడలో మైనార్టీ నాయకుడు మస్తాన్‌పై తెలుగుదేశం నాయకులు జులుం ప్రదర్శించారు. దీనిపై ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తిరివీధి చెన్నకేశవులుపై గురువారం రాత్రి మద్యం మత్తులో పచ్చమూక దాడి చేసింది. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. నెల్లూరులోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితుడిని శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పరామర్శించి ధైర్యం చెప్పారు.

క్లుప్తంగా

మహిళ దారుణ హత్య

- తమ్ముడిపైనే అనుమానం



రాణి (ఫైల్)

కొడవలూరు: మహిళ దారుణ హత్యకు గురైన ఘటన ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని నార్తురాజుపాళెం దిన్నె ప్రాంతానికి చెందిన బయ్యా రాణి (44) తమ్ముడి వరుసయ్యే ఒట్టూరు అనూప్ అనే వ్యక్తితో ఈనెల 9వ తేదీన ఇంటి నుంచి కారులో వెళ్లింది. ఆమె ఇంటికి రాకపోవడంతో మరుసటి రోజు రాణి కుమార్తె అనోజ్ఞ కొడవలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహిళ అదృశ్యం కేసు నమోదు చేసిన ఎస్సై కె.వీరప్రతాప్ దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలోనే కావలి రూరల్ మండలం చిప్పలేరు వాగు వద్ద గురువారం మహిళ మృతదేహాన్ని స్థానికులు చూశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. శుక్రవారం మృతురాలిని రాణిగా గుర్తించారు. ఆమె హత్య చేసి తగులబెట్టారు. మృతురాలి ఒంటిపై ఉన్న నగల కోసమే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. అనూప్ ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటాడనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. రాణిది హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

బస్సు ఢీకొని మహిళ దుర్మరణం



వెంకటలక్ష్మి మృతదేహం

వెంకటాచలం: మోటార్‌బైక్‌ను బస్సు ఢీకొని మహిళ మృతిచెందిన ఘటన మండలంలోని ఈదగాలి పంచాయతీ శ్రీకాంత్ కాలనీ సమీపంలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఈదగాలి పంచాయతీ కొత్త సంఘానికి చెందిన వెందోటి సుబ్రహ్మణ్యం, అతని భార్య వెంకటలక్ష్మి (32) బైక్‌పై సర్వేపల్లికి బయలుదేరారు. శ్రీకాంత్ గిరిజనకాలనీ సమీపానికి చేరుకోగానే ప్రమాదవశాత్తు ఎదురుగా వచ్చిన బస్సు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటలక్ష్మికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. సుబ్రహ్మణ్యం గాయపడగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. వెంకటలక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

అన్ని స్థానాల్లో విజయం ఖాయం

- రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు



ప్రచారం చేస్తున్న రామిరెడ్డి, బీద

కావలి: వచ్చే ఎన్నికల్లో నెల్లూరు పార్లమెంట్ పరిధిలో అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం ఖాయమని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు అన్నారు. పట్టణంలోని పాతూరులో శుక్రవారం ఆయన కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డితో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా రామిరెడ్డి కావలి రాజకీయాల్లో సరికొత్త రికార్డులు సృష్టిస్తారన్నారు. అదే విధంగా నెల్లూరు ఎంపీగా జిల్లావాసి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడు వేణుంబాక విజయసాయిరెడ్డి పోటీ చేయడం జిల్లా ప్రజల అదృష్టమన్నారు. ఆయన్ను గెలిపిస్తే జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. విజయసాయిరెడ్డి ఉత్తమ పార్లమెంటేరియన్ అని, విలువలు పాటించే వ్యక్తి అన్నారు. జిల్లాలో అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా అందించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు మరింత సంక్షేమం, అభివృద్ధి



ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: 'వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితేనే ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందుతాయి. చంద్రబాబు అధికారంలోకి వస్తే మోసం చేస్తాడు తప్ప ఏమీ చేయడు' అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని మోడిగుంట గ్రామంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసన్న మాట్లాడుతూ నల్లపరెడ్డి కుటుంబాన్ని ప్రజలు అనేక సంవత్సరాలుగా ఆదరిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ తనను ఆశీర్వదించాలన్నారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నమ్మకంగా ఉంటూ పదవులు అనుభవించాడన్నారు. ముస్లిం వ్యక్తికి నెల్లూరు సిటీ టికెట్ ఇస్తే జీర్ణించుకోలేక టీడీపీలో చేరడం జరిగిందన్నారు. నమ్మించి గొంతుకోసే నమ్మకద్రోహులను చిత్తుగా ఓడించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. వేమిరెడ్డి ఇచ్చే డబ్బుకు కక్కుర్తిపడి కొందరు నేతలు పార్టీ వీడి వెళ్లిపోయారన్నారు. అయితే అక్కడ ప్రశాంతంగా లేకపోవడంతో దిక్కుతోచక అయోమయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. టీడీపీ అభ్యర్థి ప్రశాంతిరెడ్డిని సామాన్య ప్రజలు కలిసి సమస్యలు చెప్పే పరిస్థితి లేదన్నారు. ఎంపీగా పోటీ చేస్తున్న విజయసాయిరెడ్డి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడన్నారు. ఆయన గెలిస్తే నెల్లూరు రూపురేఖలు మారిపోతాయన్నారు. కోవూరు నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారిస్తారన్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఏనాడు ప్రజలను పట్టించుకున్న సందర్భాలు లేవన్నారు. జగన్‌కు సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష అన్నారు. వైఎస్సార్‌సీపీని ఒంటరిగా ఎదుర్కొనే ధైర్యం లేక బాబు బీజేపీ, జనసేనతో కూటమి కట్టి వస్తున్నాడన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి, నల్లపరెడ్డి రాజేంద్రనాథ్‌రెడ్డి, నల్లపరెడ్డి రజిత్‌కుమార్‌రెడ్డి, నల్లపరెడ్డి రాహిల్‌రెడ్డి, సర్పంచ్ వెంకటరమణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, డీఏఏబీ చైర్మన్ నిరంతన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కూటమికి గుణపాఠం చెప్పండి

- వైఎస్సార్‌సీపీ ఉదయగిరి అభ్యర్థి మేకపాటి



ప్రచారం చేస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

కొండాపురం: 'టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని ఓడించి గుణపాఠం చెప్పండి. సంక్షేమ పథకాలతో అండగా నిలిచిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేయండి' అని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని లింగన్నపాళెం, సత్యవోలు, అగ్రహారం, పార్లపల్లి గ్రామాల్లో శుక్రవారం ఆయన విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు ఎన్ని పార్టీలతో కలిసొచ్చినా జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించలేరన్నారు. టీడీపీ తరపున పోటీలో ఉన్న కాకర్ల సురేష్ ఎన్నికల తర్వాత అమెరికాకు, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సొంతాఫ్రికాకు వెళ్లిపోతారన్నారు. అందుబాటులో ఉండే తనను, విజయసాయిరెడ్డిని ఎంపీగా గెలిపించాలని కోరారు. జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందించారన్నారు. మళ్లీ అలాగే జరగాలంటే వైఎస్సార్‌సీపీని గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వృద్ధులకు ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటి వద్ద పింఛన్లు అందకుండా చంద్రబాబు కుట్రలు చేశారన్నారు. టీడీపీని ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ చిమిలి రవీంద్ర, గుడవల్లూరు సొసైటీ అధ్యక్షుడు కర్తం శ్రీనివాసులురెడ్డి, సత్యవోలు, పార్లపల్లి సర్పంచ్‌లు పరుచూరి మాల్యాద్రి, పెనుబాకల శైలజ, ఎంపీటీసీలు లెక్కల వెంకటరమణయ్య, బంకా మాల్యాద్రి, నాయకులు ముక్కెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.70
సన్నవి : రూ.55
పండ్లు : రూ.24

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 160
లేయర్ (లైవ్) : 98
బ్రాయిలర్ చికెన్ : 280
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 310
లేయర్ చికెన్ : 167